## క్లుప్తంగా

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తనిఖీ



ముప్పాళ్ల: మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని జిల్లా పౌర సరఫరాల మేనేజర్, మండల ప్రత్యేకాధికారి జి.వరలక్ష్మి శనివారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆసుపత్రిలో ఓపీ రికార్డును పరిశీలించారు. ఫార్మసిస్టు పోస్టు ఖాళీగా ఉండటంతో విధుల నిర్వహణపై ఆరా తీశారు. రోగులకు ఇబ్బంది లేకుండా అవసరమైన మందులు అందించేందుకు సిబ్బందికి ఆ బాధ్యతను అప్పగించాలని సూచించారు. ప్రతి రోజు ఈ–ఔషధ్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. కాన్పులు ఆసుపత్రిలోనే జరిపించాలన్నారు. తహసీల్దార్ పి.సింగారావు, పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ, ఈఓపీఆర్డీ రూపవతి తదితరులు ఆమె వెంట ఉన్నారు.

### పండ్ల తోటల పెంపకంపై రైతులు దృష్టి పెట్టాలి



రాజుపాలెం: సన్న, చిన్నకారు రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా సబ్సిడీపై పండ్ల తోటలు, పూల తోటలు వేసుకుని ఆర్థికంగా స్థిర పడొచ్చని ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణప్రసాద్, వ్యవసాయాధికారి వెంకట నరసయ్యలు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈ మేరకు అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం ద్వారా 17 రకాల పండ్ల తోటలు, 2 రకాల పూలతోటలు వేసుకోవచ్చని తెలిపారు. ఐదెకరాలలోపు పొలం ఉన్న రైతులకు మాత్రమే ఈ సౌకర్యం వర్తిస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో చెవుల వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, హార్టీకల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

### నేడు గురుపౌర్ణమి పూజలు

గురజాల: శ్రీ షిర్డి సాయిబాబా దేవాలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

**మాచర్లలో...**

మాచర్ల: పట్టణంలోని సొసైటీ కాలనీలో వేంచేసియున్న శ్రీ సత్యసాయి దేవాలయంలో ఆదివారం గురుపౌర్ణమి ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవాలయ సభ్యులు జె.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుఝాము 5గంటలకు నుంచి ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, 8.30 గంటల వరకు సత్యసాయి బాబా పాఠశాల విద్యార్థులతో పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గురుపూజ మహోత్సవం, స్వామి వారి సమక్షంలో సత్కారం, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 6.30 గంటలకు పల్లకి ఉత్సవం, భజన ఉంటుందన్నారు.పత్తి ఫ్యాక్టరీలోని సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆల య నిర్వాహకులు వీరాంజనేయులు తెలిపారు.

విజయపురిసౌత్: స్థానిక శ్రీ సత్యసాయి ప్రేమ మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మ కర్త కె.శ్రీహరిప్రసాద్ శనివారం తెలిపారు. ఉదయం 5:15 గంటలకు కాకడ హారతి, 6 గంటలకు శ్రీ షిరిడి సాయిబాబాకు మంగళ స్నానం, 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏకాహం, ఉదయం 10 గంటలకు స్వామి వారిని పల్లకిలో గ్రామ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఉంటుందని, భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

### గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

మాచర్ల రూరల్ : మండలంలోని తాళ్ళపల్లి, భైరవునిపాడు, కొత్తపల్లి గ్రామాల్లో ఎంపీడీఓ కె.సరోజినీదేవి నేతృత్వంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. కార్మికులు కాలువల్లో మురుగు తొలగించి, వీధులను శుభ్రం చేశారు. పారిశుద్ధ్యంపై స్థానికులకు అవగాహన కల్పించారు. డయేరియా, డెంగీ, చికున్ గున్యా వంటి వ్యాధుల బారిన పడకుండా.. ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలని సూచించారు. వీధుల్లో చెత్త వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని, నిల్వ ఉన్న నీటిని వినియోగించకుండా కాచి వడపోసిన తాగునీరును ఉపయోగించాలని కోరారు. సర్పంచ్‌లు ఓరుగంటి జయప్రకాష్ రెడ్డి, పి.బ్రహ్మనాయుడు, భైరవునిపాడు కార్యదర్శులు ఆవుల వెంకట్రామయ్య, ఎల్లెబోయిన కోటేశ్వరరావు పనులను పర్యవేక్షించారు.

# ఉచిత న్యాయ సేవలు పొందేందుకు అవకాశం



సబ్ జైలులో ముద్దాయిలతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు



బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: ఆర్థిక స్తోమత లేని ముద్దాయిలకు న్యాయస్థానమే ప్రభుత్వం తరపున న్యాయ సహాయం అందిస్తుందని సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు అన్నారు. ఆ మేరకు న్యాయవాదిని నియమించే అవకాశం ఉందని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణంలోని సబ్ జైలును శనివారం ఆయన సందర్శించారు. ముద్దాయిలకు అందుతున్న సౌకర్యాలు, ఆహారం గురించి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలను, సరకులను పరిశీలించారు. వెంట సత్తెనపల్లి రెండో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మహమ్మద్ గౌస్, జైలు సూపరింటెండెంట్ టి.వెంకటరత్నం, న్యాయవాది బి.ఎల్.కోటేశ్వరరావు కూడా ఉన్నారు.

# గురుకుల బాలుర వసతి గృహం తనిఖీ

**సమస్యలు తెలుసుకున్న డీఎల్‌డీఓ గబ్రూ నాయక్**



సూచనలిస్తున్న గబ్రూ నాయక్

రెంటచింతల: క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య ద్వారా బంగారు భవిష్యత్తు ఉంటుందని డివిజనల్ అభివృద్ధి అధికారి గబ్రూ నాయక్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలురు) సంక్షేమ వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. మౌలిక వసతులు, ఆహారం తయారీ, సమస్యలను తెలుసుకుని, విద్యార్థులతో మాట్లాడారు. ఒకే గదిలో పడుకోవడం, చదువుకోవడం జరుగుతోందని, ఆట స్థలం, మెస్ హాల్ లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆయనకు వివరించారు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పోటీ తత్వాన్ని కలిగి ఉండాలని, పట్టుదల ఉంటే ఖచ్చితంగా ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఈ సందర్భంగా విద్యార్థులకు చెప్పారు. ఈ కార్యకరమంలో స్కూల్ ప్రిన్సిపల్ సింహాద్రి మోహన్, కార్యదర్శి జి.అనంత కోటేశ్వరరావు, వార్డెన్, ఉపాధ్యాయులున్నారు.

# అన్ని రంగాల్లో మండలాభివృద్ధికి కృషి

**ఎంపీపీ అలుగుమల్లి సంజీవరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సంజీవరెడ్డి

వెల్దుర్తి: మండలాన్ని అన్ని రంగాల్లో సమష్టిగా అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ వంతు కృషి చేయాలని మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఎంపీపీ పాల్గొని మాట్లాడారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యగా సైడు కాల్వల్లోని మురుగును తొలగించాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రాధాన్య క్రమంలో గుర్తించి, వాటిని పూర్తి చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి కూలీలకు పనులను కల్పించేందుకు వేసవి కన్నా ముందే పనులను గుర్తించి, మంజూరు చేయించాలన్నారు. వెనుకబడిన మండలంలో అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలంటే.. ఎక్కువ దినాలు ఉండే పనులను గుర్తించి అనుమతులు పొందాలని చెప్పారు. రైతుల భూముల్లో ఉండే రాళ్లను ఏరివేసేందుకు ప్రాజెక్టు అధికారి నుంచి అనుమతులు పొందాలన్నారు. వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నుంచి వచ్చే అన్నీ సంక్షేమ పథకాలను అర్హులకు అందించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహ, తహసీల్దారు చంద్రశేఖర్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాయంకుల గోపాల్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోపాల్‌సింగ్ నాయక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, వివిధ శాఖల మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి




రికార్డులు తనిఖీ చేస్తున్న విజయభాస్కరరెడ్డి

నాదెండ్ల: మండలంలోని తూబాడు అంగన్‌వాడీ–2 కేంద్రాన్ని, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల ప్రత్యేకాధికారి ఎం విజయభాస్కర్‌రెడ్డి తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్లో ప్రతిరోజూ ఎంత మంది విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు రక్తహీనత, ఎత్తుకు తగ్గ బరువు ఉన్నారో లేదో తూకం వేసి చూశారు. అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల సమీపంలోని బావిని పరిశీలించి నీటి నాణ్యతను పరీక్షించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై కార్మికులకు పలు సూచనలు చేశారు. చిన్నారులకు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు వహించాలని ఆదేశించారు. జ్వరాలు, సీజనల్ వ్యాధులు సోకితే తక్షణమే ఏఎన్ఎంల ద్వారా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించాలన్నారు. ఆయన వెంట కార్యదర్శి జంగు జరీనా ఉన్నారు.

**సీజనల్ వ్యాధులు ప్రబలనివ్వకండి**

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని జిల్లా గ్రామ పంచాయతీల అధికారి, మండల ప్రత్యేకాధికారి ఎం.విజయభాస్కరరెడ్డి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం గ్రామాల్లో డయేరియా, మలేరియా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గ్రామ పంచాయతీలు కుళాయి ద్వారా విడుదల చేసే తాగునీరు కూడా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించాలన్నారు. ప్రతి వారంలో శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. దోమల నియంత్రణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ ఉన్నారు.

# తాగునీటి చెరువులు సకాలంలో నింపేందుకు చర్యలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ గోవిందరావు, డీఈఈ వెంకట రమణ

చిలకలూరిపేట: మంచినీటి చెరువులను సకాలంలో నింపేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు తెలిపారు. పట్టణానికి మంచినీటిని సరఫరా చేసే చెరువులకు సాగర్ జలాలు చేరనున్న నేపథ్యంలో శనివారం ఇంజినీరింగ్ అధికారులతో కలసి చెరువుల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు వృధా కాకుండా రాపిడ్ ఫిల్లింగ్ కోసం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దీని నిమిత్తం ఎలక్ట్రికల్ మోటార్లు, డీజిల్ ఇంజన్లు, తూముల వద్ద ఇసుక బస్తాలు ఏర్పాటు చేశామన్నారు. మంచినీటిని ఇతర అవసరాలకు ఉపయోగించుకుండా కాల్వపై కాపలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ తోట వెంకటరమణ, ఏఈఈ చల్లా శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్లో ప్రత్యేకాధికారి పరిశీలన



రొంపిచర్ల : మండలంలోని వి.రెడ్డిపాలెంలో గల పీఎంశ్రీ పాఠశాల అయిన ఏపీ మోడల్ స్కూల్‌ను శనివారం మండల ప్రత్యేక అధికారి కె.సూర్యప్రకాష్ రెడ్డి పరిశీలించారు. పాఠశాలలోని తరగతి గదులను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించే విధానాన్ని పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. పాఠశాల నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. హాస్టల్ నిర్వహణ, పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో వంటలు తయారీ, రుచులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అదే విధంగా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాలను కూడా ఆయన సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టికను, రికార్డులను, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం నుంచి అందే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–2 డి.బ్రహ్మేశ్వరరావు, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్, హెచ్ఎం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన చదువు అందించాలి

**మినీ గురుకుల పాఠశాల తనిఖీలో ఏడీప**


వెల్దుర్తి: మండలంలోని గుడిపాడు చెరువులో ఉన్న గిరిజన గురుకుల మినీ పాఠశాలను మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ జగదీష్‌రెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. వసతి గృహ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా..లేదా అని తెలుసుకున్నారు. విద్యార్థినులతో పాటు మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణను, వంటశాల, మరుగుదొడ్లను, తరగతి గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల రిసోర్సు పర్సన్ పూర్ణచంద్రరావు, గురుకుల పాఠశాల హెచ్ఎం మార్తమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీ పడొద్దు



మాచర్ల రూరల్: మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపించకుండా మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని ఎంపీడీఓ కె.సరోజినీ దేవి కోరారు. శనివారం కొత్తపల్లిలోని ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, రికార్డులను ఆమె తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పాఠశాల ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూసి, పిచ్చి మొక్కలు తొలగించాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యతలో రాజీపడకుండా సమయపాలన పాటించాలని చెప్పారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, తగు సూచనలు అందించారు. సర్పంచ్ జయప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, కార్యదర్శి బాబులాల్ నాయక్ ఉన్నారు.

## విద్యా ప్రమాణాలు పెంచండి



మాచర్ల: ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా ఉండి, ప్రేమ పూర్వకంగా విద్యార్థులకు బోధించాలని ఎంఈఓ 2, ట్రైనింగ్ కో ఆర్డినేషన్ డైరెక్టర్ అల్లి సురేష్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా పట్టణంలోని జెడ్పీహెచ్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏడు మండలాలకు చెందిన హెచ్ఎంలు, టీచింగ్ టు అబ్జర్వర్స్‌కు శిక్షణ కార్యక్రమం జరుగుతోంది. తొమ్మిది రోజుల శిక్షణను ఉపయోగించుకొని ఉపాధ్యాయుల బోధన తీరును మెరుగుపరుచుకోవాలన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ఇస్తామని తెలిపారు. ఎంపీడీఓ సరోజినీ దేవి, ప్రత్యేకాధికారి గబ్రూ నాయక్ పరిశీలించారు. పలువురు ట్రైనీలు, ప్రధానోపాధ్యాయులు, ఎస్‌జీటీలు పాల్గొన్నారు.

## తెలంగాణ మద్యం స్వాధీనం

వెల్దుర్తి: మండలంలోని శ్రీరామపురం తండాలో తెలంగాణ మద్యాన్ని అక్రమంగా అమ్ముతున్న పాత్లావత్ రూబెన్ నాయక్‌ను అరెస్టు చేసి, 48 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ శనివారం తెలిపారు. రూబెన్‌నాయక్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

## ఎన్‌ఈసీ కళాశాల క్యాడెట్స్‌కు పతకాలు



నరసరావుపేట రూరల్: బాపట్ల సూర్యలంకలోని ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు జరిగిన ఐదు జిల్లాల ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో ఎన్‌ఈసీ కళాశాల క్యాడెట్స్ ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. సీనియర్ కేటగిరిలో ఎంవీ సుస్వంత్, జి.చిన్మయి, కె.కావేరి గోల్డ్‌మెడల్స్, ఫోటోగ్రఫిలో యు.ముత్తయ్య, ఫ్లాగ్ ఏరియాలో సి.హెచ్ చిరంజీవి, షేక్ అఫ్రీన్ నేహా, బీబీ రాణి గోల్డ్‌మెడల్స్, మహిళల ఫైరింగ్ విభాగంలో కె.గాంధీకుమారి(గోల్డ్‌మెడల్), జి.కావ్య (సిల్వర్ మెడల్) సాధించినట్లు వివరించారు. శిక్షణా శిబిరంలో అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చినందుకు ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను ఎన్‌ఈసీ కళాశాల కైవసం చేసుకున్నట్లు తెలిపారు. పతకాలు సాధించిన క్యాడెట్స్‌ను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, అధ్యాపకులు అభినందించారు.

# నీళ్ల ట్యాంక్‌ను శుభ్రపరిచిన సిబ్బంది



గణపవరం ఎస్టీ కాలనీలోని ట్యాంక్‌ను శుభ్రపరుస్తున్న ఆరోగ్య సిబ్బంది

రాజుపాలెం: మండలంలోని గణపవరం ఎస్టీ కాలనీలోని వాటర్ ట్యాంక్‌లో నీటిని పరిశీలించగా కలుషితమైనట్లు రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శనివారం నిర్ధారించారు. కొంత కాలం క్రితం ట్యాంక్ ఏర్పాటు చేసి, సమీపంలో బోర్ ద్వారా నీటిని ఎక్కిస్తున్నారు. కాలనీవాసులకు దీని ద్వారా నీటి అవసరాలు తీరుతున్నాయి. ఆరోగ్య సిబ్బంది ఈ నీళ్ల ట్యాంక్‌ను ఇటీవల పరిశీలించగా అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. నీటిని ల్యాబ్‌కు పంపించి పరీక్ష చేయగా బోరు నీరు కలుషితమైనట్లు తేలింది. వెంటనే కమ్యూనిటీ హెల్త్ అధికారి అలేఖ్య ప్రజలను అప్రమత్తం చేశారు. బోర్‌ను వాడకుండా సీజ్ చేశారు. పరిసరాలలో పంచాయతీ సిబ్బంది బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వాటర్ ట్యాంక్‌ను కూడా శుభ్రపరిచారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవాని, పంచాయతీ కార్యదర్శి మహంకాళమ్మ, హెల్త్ విజిటర్ ఉషారాణి, సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విరాళంతో పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శ్రీకారం



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

బాలెమర్రు(క్రోసూరు): బాలెమర్రు ఎంపీపీ పాఠశాల ప్రహరీ నిర్మాణానికి దాత విరాళంతో శనివారం శ్రీకారం చుట్టారు. బాలెమర్రులో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసి ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పి.శారద విధులు నిర్వర్తిస్తున్నారు. తాను చదివిన ఈ పాఠశాల అభివృద్ధికి ముందుకు వచ్చారు. రూ.2.50 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి అంగీకరించారు. ప్రధానోపాధ్యాయుడు టి. శరత్ కుమార్ అధ్యక్షతన ఎంఈవో ఏకుల ప్రసాదరావు సమక్షంలో శారద, మూర్తి దంపతులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ దాతలు బడి అభివృద్ధికి ముందుకు రావటం సంతోషించదగిన విషయమని అన్నారు. కార్యక్రమంలో ఊటుకూరు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కటికల ప్రకాష్ , క్రోసూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్ ప్రధానోపాధ్యాయులు ఎం. మోహన్‌బాబు, ఉపాధ్యాయులు బోళ్ల నర్సింహారెడ్డి, పి.వెంకటేశ్వరరావు ,సర్పంచి తాళ్లూరి ధనలక్ష్మి, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నిరంతర వైద్య విద్య కార్యక్రమంపై అవగాహన



శ్రీనివాస్‌రెడ్డిని అభినందిస్తున్న భరత్‌కుమార్

పిడుగురాళ్ల: నిరంతరం వైద్య విద్యపై అవగాహన కార్యక్రమం పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిడుగురాళ్ల శాఖ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. శాఖ అధ్యక్షుడు డాక్టర్ భరత్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా యశోధ హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జన్ మెడగం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని, మోకాళ్ల నొప్పుల వైద్య విధానం గురించి ప్రసంగించారు. గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ తరుణ్ ఎండో స్కోపి ద్వారా పేగు సమస్యలను గుర్తించడం, చికిత్స విధనాలను వివరించారు. హాస్పిటల్ వైద్యులను సన్మానించి, ప్రశంసా పత్రాలు, షీల్డ్స్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ పిడుగురాళ్ల శాఖ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పెండ్యాల సునీల్‌కుమార్, సెక్రటరీ డాక్టర్ బొర్రా రాంప్రసాద్, ఐఎంఏ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

# 108 గుండాలతో శ్రీ గురుగీతాహోమం

**తరలివచ్చిన ఎన్ఆర్ఐలు, ఉభయ తెలుగు రాష్ట్రాల భక్తులు**



శ్రీగురు గీతాహోమంలో పాల్గొన్న ఐసీఎం సంస్థ ఎండీ బ్రహ్మనాయుడు దంపతులు



మాట్లాడుతున్న చిలకలూరిపేట ఆధ్యాత్మిక జ్ఞాన పీఠ వ్యవస్థాపకులు దేవిశెట్టి మల్లికార్జునరావు

నాదెండ్ల: శ్రీ గురుగీతాహోమం నిర్వహించినట్లయితే విశ్వంలో సమస్త దేవతలు, గురువులను పూజించినట్లని, భగవంతుని అనుగ్రహానికి ప్రాప్తులౌతారని చిలకలూరిపేట ఆధ్యాత్మిక జ్ఞాన పీఠ వ్యవస్థాపకులు దేవిశెట్టి మల్లికార్జునరావు చెప్పారు. గణపవరం ఇడుపులపాడు కాటన్ మిల్సు ఆయిల్ డివిజన్ గోడౌన్‌లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ శ్రీ గురు గీతా హోమం నిర్వహించారు. 108 హోమగుండాలతో 151 రకాల విశేష హోమ ద్రవ్యాలతో సామూహిక హోమసహిత సంపూర్ణ హోమం జరిపారు. ప్రతి హోమ గుండం వద్ద ఒక కుటుంబ సభ్యులు పాల్గొని భక్తిశ్రద్ధలతో హోమ కార్యక్రమం పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాస మహర్షి రచించిన స్కంద పురాణంలో గురువు మహత్యం తెలుపుతూ పార్వతీ దేవి కోరిక మేరకు పరమేశ్వరుడు శ్రీ గురుగీతా హోమం గురించి వివరించినట్లు తెలిపారు. ఈ హోమానికి ఎన్ఆర్ఐలతో పాటూ ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు తరలివచ్చారు. 35 ఏళ్ల క్రితం చిలకలూరిపేట ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం ఏర్పాటు చేశామని, గత ఐదేళ్లుగా శ్రీ గురుగీతా హోమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికీ జ్ఞానపీఠంలో జూమ్‌యాప్ ద్వారా భక్తులకు అనేక ఆధ్యాత్మిక విషయాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ హోమంలో ఇడుపులపాడు కాటన్‌మిల్స్ ఎంపీ కామేపల్లి బ్రహ్మనాయుడు దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాలను నిర్వాహకులు కేతినేని శ్రీహరిరావు, ప్రవీణ్, అంకమ్మచౌదరి, రోటరీ క్లబ్ సభ్యులు, జ్ఞానపీఠ అధ్యక్షుడు రావూరి అన్నపూర్ణ, కార్యదర్శి నల్లమల్లి పద్మజ, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

బొల్లాపల్లి : ప్రస్తుతం వర్షాకాలంలో ప్రబలే అంటు వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.శంకర్‌నారాయణ తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రజలే అవకాశం ఉందని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి ద్వారా, కీటక జనిత ద్వారా పలు రకాల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. వీటి పట్ల కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కీటక జనిత ద్వారా డెంగ్యూ, మల్లేరియా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధులు ప్రబలుతాయని, తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండటం వలన లార్వా వ్యాప్తి చెంది అంటువ్యాధులు ప్రబలుతాయన్నారు. డయేరియాపై సూచనలు చేశారు. భోజనానికి ముందు, అనంతరం చేతులు శుభ్రపరచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని, ఈగలు, దోమలు, పలు రకాల కీటకాలు వాలిన పదార్థాలు, బహిరంగ ప్రదేశాల్లోని ఆహార పదార్థాలను భుజించరాదని, పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. వారంలో శుక్ర, శని, ఆది మూడు రోజుల పాటు పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై వైద్యసిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి తగు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆయా సబ్ సెంటర్ల పరిధిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా గ్రామస్తులకు సూచనలు చేశారు.కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.